క్లుప్తంగా

మసీదు అభివృద్ధికి సహకరిస్తాం



మసీదు పెద్దలతో మాట్లాడుతున్న విప్ ఉదయభాను

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): గ్రామంలో మసీదు అభివృద్ధికి సహకరిస్తామని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను తెలిపారు. గ్రామంలో శ్లాబ్ పెచ్చులూడి శిథిలావస్థలో ఉన్న మసీదును ఆయన శుక్రవారం పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మసీదు అభివృద్ధికి, మసీదు పెద్దలు ఇమామ్, మౌజన్‌కు నెలనెలా ప్రభుత్వం నుంచి అందే జీతాలను అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్కపూడి గాంధీ, మాజీ ఎంపీపీ శ్రీనివాసరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వాసు, సొసైటీ అధ్యక్షుడు గూడపాటి రవికుమార్, నాయకులు నాగేశ్వరరావు, రవికుమార్, చెన్నకేశవులు, జాన్‌మియా పాల్గొన్నారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కానిస్టేబుల్ అరెస్ట్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉద్దేశపూర్వకంగా మాట్లాడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అనుచిత వాఖ్యలు చేసిన ఏఆర్ కానిస్టేబుల్ తన్నీరు వెంకటేశ్వర్లును అరెస్ట్ చేసినట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైవే మొబైల్ వాహనం డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వెంకటేశ్వర్లు ఈ నెల ఒకటో తేదీన రాత్రి ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గంలోని చిల్లకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో గౌరవరం హైవే వద్ద అనుచితంగా ప్రవర్తించాడు. సీఎం జగన్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను పరుషపదజాలంతో దూషించాడు. పోలీసుల జీతాల విడుదల విషయాన్ని ప్రస్తావించిన గౌరవరం గ్రామస్తుడు సతీష్ వద్ద కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు ఈ వాఖ్యలు చేశాడు. ఈ వాఖ్యలను చిత్రీకరించిన గౌరవరం గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిల్లకల్లు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీపీ వెల్లడించారు. వీడియోను పరిశీలించిన తరువాత ఉద్దేశపూర్వకంగానే కానిస్టేబుల్ ఈ వాఖ్యలు చేసినట్లు నిర్ధారణకు వచ్చామన్నారు. బాధ్యతాయుతమైన ఉద్యోగంలో ఉండీ రెండు రాజకీయ పార్టీల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడిన కానిస్టేబుల్‌ను అరెస్ట్ చేసి జగ్గయ్యపేట అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టుకు తరలించామన్నారు. న్యాయస్థానం నిందితుడికి 14 రోజులు రిమాండ్ విధించడంతో జగ్గయ్యపేట సబ్ జైలుకు తరలించామని వెల్లడి చేశారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా నిందిత కానిస్టేబుల్ వెంకటేశ్వర్లును సస్పెండ్ చేశామన్నారు.

పారిశుద్ధ్యం మెరుగునకు సహకరించాలి

నందిగామ: పారిశుద్ధ్యం మెరుగునకు పట్టణ ప్రజలు సహకరించాలని నగర పంచాయతీ కమిషనర్ డాక్టర్ జయరాం కోరారు. పట్టణంలోని 8వ వార్డులో శుక్రవారం ఆయన పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో రోజూ పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, తడి, పొడి చెత్తను వేర్వేరుగా భద్రపరచేలా చర్యలు తీసుకుంటూ, వ్యర్థాల నుంచి ఎరువులు తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా రామలింగేశ్వర స్వామి కల్యాణం

నందిగామ: స్థానిక మెయిన్ బజారులో వేంచేసి యున్న శ్రీ శుక శ్యామలాంబ సమేత రామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం స్వామికి అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని పార్వతీదేవిగా అలంకరించి ప్రత్యేక కుంకుమార్చన గావించారు. రాత్రి స్వామి ఎదుర్కోలోత్సవం కన్నుల పండువగా సాగింది. అనంతరం స్వామి కల్యాణం శాస్త్రోక్తంగా, కమనీయంగా నిర్వహించారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన న్యాయవాదులు

నందిగామ: పట్టణంలో నూతనంగా నిర్మించిన కోర్టు భవనాల ప్రారంభోత్సవ అనుమతి కోసం శుక్రవారం హైకోర్టు న్యాయమూర్తిని కలిసినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కన్నెగంటి జీవరత్నం శుక్రవారం తెలిపారు. పట్టణంలో నిర్మాణం పూర్తయిన సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాలు ప్రారంభోత్సవానికి అనుమతినివ్వాలని హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా ఇన్‌చార్జి న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్‌ను కలిసినట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు కృష్ణానది బ్రిడ్జి నిర్మాణ మట్టి నమూనాల పరిశీలన

ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలో కృష్ణానది బ్రిడ్జి నిర్మాణం కోసం చేపట్టిన మట్టి నమూనా సేకరణ పనులను శనివారం ప్రభుత్వవిప్ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పరిశీలిస్తారని విప్ కార్యాలయ ప్రతినిధి శుక్రువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు నది ఒడ్డున చేపట్టిన మట్టి నమూనాలను పరిశీలించి పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటారని పేర్కొన్నారు.

పెద్ద తిరునాళ్లకు సర్వం సిద్ధం

- భక్తి చానల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం
- ఈ నెల 5 నుంచి 9వ తేదీవరకు ఉత్సవాలు



సిద్ధమవుతున్న కల్యాణ వేదిక

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మవారి కల్యాణ మహోత్సవాల(పెద్ద తిరునాళ్ల) విజయవంతానికి ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ తిరునాళ్ల ఈ నెల 5 నుంచి 9వ తేదీవరకు నిర్వహించనున్నారు. ఆదివారం కల్యాణం చూసేందుకు వీవీపీ పాస్‌లు ఏర్పాటు చేయడంతో పాటు రూ.200 టికెట్లు 4,5 తేదీల్లో భక్తులకు అందుబాటులో ఉంచుతున్నామని ఆలయ ఈఓ జీవీడీఎన్ లీలాకుమార్, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు శుక్రవారం తెలిపారు. కల్యాణాన్ని భక్తి చానల్ ద్వారా ఆదివారం రాత్రి ఎనిమిది గంటల నుంచి కల్యాణం జరిగే సమయంలో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు పేర్కొన్నారు. కల్యాణం రోజున మునేరు అవతల ఆడిటోరియంలో దీక్ష విరమించిన స్వాములకు, వారి పక్కన వచ్చిన వారికి 25 వేల మందికి భోజన ఏర్పాట్లు ఉదయం 10 గంటల కల్లా తయారు చేసి ఉంచుతామని తెలిపారు. గ్రామంలోని పలు ఆలయాల్లో స్వాములు సేద తీరేందుకు టెంట్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. భక్తులకు 1.50 లక్షల లడ్డూ ప్రసాదాలను సిద్ధంగా ఉంచుతున్నామన్నారు. కల్యాణం పూర్తయిన తరువాత అమ్మవారి తలంబ్రాలు భక్తులకు పంపిణీ చేస్తామని, ఆలయ అధికారులకు సహకరించాలన్నారు.

ఐదు రోజుల పాటు ఆలయం వద్ద అంబులెన్స్, మెడికల్ క్యాంప్‌తో పాటు ఫైర్ ఇంజిన్ అందుబాటులో ఉంచుతామన్నారు. కల్యాణ వేదిక వద్ద స్థల శుద్ధి పూజలు, హోమాలు అనంతరం శనివారం పూర్ణాహుతితో ముగుస్తాయన్నారు. ఈఓ, చైర్మన్‌తో పాటు ఎస్సై హరిప్రసాద్, ఈఈ వైకుంఠరావు, ఏఈ రాజు అన్నదాన పరిసరాలు, క్యూలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.



ఆలయంలో లడ్డూ ప్రసాదాలు సిద్ధం చేస్తున్న సిబ్బంది



అన్నదాన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆలయ ఈఓ లీలాకుమార్, చైర్మన్ చెన్నకేశవరావు

హామీలను అమలు చేస్తున్న సీఎం జగన్

ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహన్‌రావు

కంచికచర్ల: ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. కంచికచర్ల 17,18 వార్డులలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకూ వెళ్లి, ప్రజలను ఆప్యాయంగా పలకరించంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందుతున్న తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలను రాజకీయాలకతీతంగా అమలు చేస్తూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చుతున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అన్ని వర్గాల సంతోషం, సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. ఉన్నత కులాల్లోని పేదలకు ఆర్థిక సాయం అందించడం, అర్హతగల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయడంతో పాటు ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ల పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, జెడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, సర్పంచ్ సునీత, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు నన్నపనేని నరసింహారావు, వేమా సురేష్‌బాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాడుగుల శంకర్, ఎంపీటీసీ సభ్యుడు మధుబాబు తదితరులు పాల్గొన్నారు.



కంచికచర్లలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

న్యూహోప్ సేవలు అభినందనీయం

ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వవిప్ ఉదయభాను, ఏసీపీ నాగేశ్వరరెడ్డి

వత్సవాయి: చిల్లకల్లు న్యూహోప్ మినిస్ట్రీస్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. న్యూహోప్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు వత్సవాయి జెడ్పీ పాఠశాలలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నందిగామ ఏసీపీ జి.నాగేశ్వరరెడ్డితో శుక్రవారం కలిసి ప్రారంభించారు. గత 20 సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో ఉచిత వైద్యశిబిరాలను నిర్వహిస్తూ పేదల మన్ననలను పొందిన సంస్థ న్యూహోప్ అని తెలిపారు. అమెరికాకు చెందిన అత్యుత్తమ వైద్యులతో వైద్యం అందించడంతో పాటు ఉచితంగా కళ్లజోళ్లను కూడా అందించడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గుంటూరు శంకర్ నేత్రాలయంతోపాటు ఖమ్మానికి చెందిన మమత మల్టీ స్పెషాలిటీవారు సహకారం అందిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు రూత్‌ప్రభుదాస్ తెలిపారు. ఈ శిబిరాన్ని అమెరికా వైద్యులు అరున్‌లేక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా సీతమ్మ, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, మండల పార్టీ అధ్యక్షుడు గాదెల రామారావు, సొసైటీ అధ్యక్షులు రంగిశెటి ముత్తయ్య, భూక్యా రాజానాయక్, పండగ శ్రీనివాసరావు, కొలికిపోగు వెంకటేశ్వర్లు, చింతల ఏడుకొండలు పాల్గొన్నారు.

బైకెక్కిన సర్పం..!





ఓ పాము నందిగామ పట్టణంలో మోటార్ బైక్‌లపై తిరుగుతూ చూపరులను భయభ్రాంతులకు గురిచేసింది. పట్టణంలోని మెయిన్ బజార్ నిత్యం రద్దీగా ఉండే ప్రధాన వ్యాపార కూడలిలోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ సమీపంలో శుక్రవారం మధ్యాహ్నం ఎక్కడ నుంచి వచ్చిందో తెలియదు. సెంటర్ పార్కింగ్‌లో ఉన్న ద్విచక్రవాహనాలపై కనిపించింది. సుమారు మూడు అడుగుల పైన పొడవు ఉన్న ఆ పామును చూసి స్థానికులు ఆందోళనకు గురయ్యారు. చివరకు ఆ పామును కొట్టి చంపడంతో వాహన యజమానులు ఊపిరి పీల్చుకున్నారు.

-నందిగామ

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ



బలుసుపాడులో పింఛన్ అందజేస్తున్న వలంటీర్

జగ్గయ్యపేట: మండలంలో పింఛన్ల పంపిణీ ఉత్సాహంగా జరుగుతుంది. 17 గ్రామ పంచాయతీలలోని గ్రామ వలంటీర్లు ఇంటింటికీ తిరుగుతూ పింఛన్లు అందజేస్తున్నారు. ఇటీవల పెంచిన పింఛన్ నగదుతో కలిపి అందిస్తున్నారు. తెల్లవారుజాము నుంచే ఇంటింటికీ తిరుగుతూ లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్నారు. ఇప్పటి వరకు మండలంలో 80 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ జయచంద్ర తెలిపారు.

పెనుగంచిప్రోలు 98 శాతం పంపిణీ



కొణకంచిలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్

పెనుగంచిప్రోలు: మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీ శుక్రవారంతో 98 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తెల్లవారుజాము నుంచే పింఛన్ల పంపిణీలో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. మండలంలో మొత్తం 8,401 మంది పింఛన్‌దారులు ఉన్నారని తెలిపారు.

శ్రీనివాసబాబు సేవలు స్ఫూర్తిదాయకం



శ్రీనివాసబాబును అభినందిస్తున్న ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: ప్రభుత్వ పీఏ మద్దిపట్ల శ్రీనివాసబాబు సేవలు స్ఫూర్తిదాయకం అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనపరచిన ఉద్యోగులకు ప్రభుత్వం అందజేసే పురస్కారాన్ని జగ్గయ్యపేట ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రభుత్వ పీఏగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసబాబు అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయభాను నివాసంలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాసబాబును ఎమ్మెల్యే ఉదయభాను అభినందించారు.

నందిగామలో కళాతపస్వి జ్ఞాపకాలు

ముక్కోటి వేడుకల్లో పాల్గొన్న కె.విశ్వనాథ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న కె.విశ్వనాథ్ (ఫైల్)

నందిగామ: కళాతపస్వి, ప్రముఖ సినీ దర్శకుడు, నటుడు కె.విశ్వనాథ్ 2018 లో నందిగామ పట్టణానికి వచ్చారు. స్థానిక ముక్కోటి మండపంలో ప్రతి ఏటా వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా 2018 జనవరి 4వ తేదీన నందిగామలో జరిగిన 118 వ వైకుంఠ ఏకాదశి మహోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంలో ఆయన ప్రసంగించిన మాటలు పెద్దవారితో పాటు, యువతను కూడా ఆలోచింపజేసేవిగా ఉన్నాయి. ముఖ్యంగా ఒక మనిషికి సమాజంలో మంచి పేరు రావాలంటే ఎలా ఉండాలి అనే అంశాలపై ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం ఉన్నత శిఖరాలలో ఉన్న ప్రతి ఒక్కరూ కూడా కింద నుంచి ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ ఎదిగిన వారేనన్నారు. అటువంటి వారిని ఆదర్శంగా తీసుకొని యువత భావితరాలకు మార్గదర్శకులుగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఆయన మృతి చెందిన నేపథ్యంలో నందిగామ ప్రాంత ప్రజలు ఆనాడు విశ్వనాథ్ మాట్లాడిన మాటలను శుక్రవారం గుర్తు చేసుకున్నారు.

పేట ఆర్టీసీ డ్రైవర్‌కు జిల్లాలో ద్వితీయ స్థానం



ఉత్తమ డ్రైవర్లుగా అవార్డులు అందుకున్న పేట ఆర్టీసీ డ్రైవర్లు

జగ్గయ్యపేట అర్బన్: 34వ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ప్రమాద రహితంగా డ్రైవింగ్ చేసినందుకు గాను జగ్గయ్యపేట ఆర్టీసీ డ్రైవర్లకు అవార్డులు లభించాయి. ఈ మేరకు గురువారం రాత్రి విజయవాడలోని గవర్నరుపేట-2 డిపో గ్యారేజ్‌లో జరిగిన రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు వేడుకల్లో 30 ఏళ్లుగా విధి నిర్వహణలో ప్రమాద రహితంగా డ్రైవింగ్ చేసినందుకు జగ్గయ్యపేట ఆర్టీసీ డిపోనకు చెందిన ఎంవీ.కుమార్‌కు జిల్లాలో ద్వితీయ బహుమతి లభించినట్లు పేట డీఎం ఎంవీ.ప్రసాద్ తెలిపారు. ఆయనకు ప్రశంసాపత్రం, నగదు బహుమతిని డీటీసీ ఎం.పురేంద్ర చేతుల మీదుగా అందుకున్నారని తెలిపారు. అలాగే పేట డిపోకు చెందిన డీవీ.రావు, జీఎస్.రావు, కేఏ.నారాయణ కూడా పేట డిపో స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, ప్రశంసాపత్రాలను అందుకున్నారని పేర్కొన్నారు. వీరిని డిపో సిబ్బంది, సూపర్‌వైజర్లు అభినందించారు. పేట డీఎం ప్రసాద్ మాట్లాడుతూ అందరు డ్రైవర్లు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు జాగ్రత్తగా బస్సులు నడిపి డిపోనకు మంచిపేరు తీసుకుకొని రావాలని కోరారు.

రెండో పంటకు నీరందించడమే లక్ష్యం



మోటార్ల స్విచ్ ఆన్ చేస్తున్న కొమ్మినేని

నందిగామ: రెండో పంటకు నీరందించడమే లక్ష్యంగా మండల పరిధిలోని మాగల్లు గ్రామ పరిధిలోని మాగల్లు-2 ఐడీసీ ఎత్తిపోతల పథకం పనిచేస్తోందని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ తెలిపారు. మండలంలోని మాగల్లు-2 ఎత్తిపోతల పథకం ద్వారా శుక్రవారం పంట పొలాలకు సాగునీటిని విడుదల చేశారు. మోటార్లను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించిన రవిశంకర్ మాట్లాడుతూ రెండో పంటకు సాగునీరందించే లక్ష్యంగా జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను కృషి చేశారన్నారు. దీంతో రెండో విడత 1,500 ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. రెతులు సాగునీటిని వృథా చేసుకోకుండా సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎత్తిపోతల పథక చైర్మన్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

వత్సవాయి: ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి ఏప్రిల్ 21 నుంచి మార్చి 22వ తేదీ వరకు జరిగిన పనులపై శుక్రవారం సామాజిక తనిఖీ ప్రజావేదికను ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల వారీగా జరిగిన పనులు గురించి వివరాలు తెలుసుకున్నారు. శింగవరం, కంభంపాడు, ఆళ్లూరుపాడు, మాచినేనిపాలెం, మంగొల్లు, దేచుపాలెం, గోపినేనిపాలెం, తాళ్లూరు, పోలంపల్లి, పెద్దమోదుగపల్లి గ్రామాలలో నిర్వహించిన తనిఖీలలో మొక్కలు నాటడంలో అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. కొన్నిచోట్ల పనిచేసిన ప్రదేశాలలో పనులు చేసిన ఆనవాళ్లు లేవని సోషల్ ఆడిట్‌లో తేలింది. ఈ సందర్భంగా పీడీ జే సునీత మాట్లాడుతూ అవకతవకలపై ఫీల్డ్‌అసిస్టెంట్లపై రికవరీ విధించడం జరుగుతుందన్నారు. రికవరీ వెంటనే చెల్లించాలని చెప్పారు. వేమవరం పంచాయతీ ఫీల్డ్‌అసిస్టెంట్‌ను ప్రత్యేకంగా గుర్తించి మెచ్చుకున్నారు. పనితీరు బాగుందని ఇలానే పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని చెప్పారు. ముందుగా మక్కపేట గ్రామ పంచాయతీలో జరుగుతున్న పనులను స్వయంగా పరిశీలించి కూలీలనడిగి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఆఫీసర్ విజయలక్ష్మి, సోషల్ ఆడిట్ అధికారి రాణాప్రతాప్, స్టేట్ రిసోర్స్‌పర్సన్ నాగరాజు, ఎంపీడీఓ ఎస్వీ ప్రసాద్, ఏపీఓ రాఘవ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

షిర్డీకి 23 మంది భక్తులతో పాదయాత్ర



పాదయాత్రలో భక్తులు

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): కంచికచర్ల మండలం పేరకలపాడు గ్రామం నుంచి 23 మంది భక్తులతో షిర్డీ సాయిబాబా దర్శనానికి బయలుదేరిన బృందం శుక్రవారం మండల పరిధిలోని జాతీయ రహదారిపై ముండ్లపాడు క్రాస్‌రోడ్స్ వద్ద అమ్మవారి ఆలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా పాదయాత్ర నిర్వాహకులు శానంపూడి శ్రీహరి మాట్లాడుతూ ఈ నెల రెండో తేదీన 23 మంది భక్తులతో, పల్లకీలో సాయిబాబా విగ్రహాన్ని మోసుకుంటూ ప్రారంభమైన పాదయాత్ర మార్చి ఒకటి లేదా రెండో తేదీన షిర్డీ చేరుతుందని పేర్కొన్నారు. మొత్తం 900 కిలోమీటర్ల పైన యాత్ర సాగుతుందని తెలిపారు.

రైతుల ప్రయోజనార్థమే రీ సర్వే

జయంతి(వీరులపాడు): రైతుల ప్రయోజనార్థమే ప్రభుత్వం భూముల రీ సర్వే నిర్వహిస్తోందని తహసీల్దార్ ఆశయ్య నాయక్ పేర్కొన్నారు. మండలంలోని జయంతి గ్రామంలో నిర్వహించనున్న వైఎస్సార్ జగనన్న భూ హక్కు భూ రక్ష పథకాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల భూ వివాదాలను పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రీ సర్వే నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ శివప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం

నందిగామ: పట్టణంలోని రామలింగేశ్వర నగర్‌లోని సాయి అయ్యప్ప ఆలయ ప్రాంగణంలో పలు దేవతామూర్తుల ప్రతిష్ఠ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ప్రతిష్ఠ మహోత్సవాలలో భాగంగా శుక్రవారం గోపూజ, పలు రకాల హోమాధి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించబోయే నవ నాగులు, శనైశ్చర, అభయాంజనేయ విగ్రహాలతో పాటు గణపతి ఆలయం ముందు ఏర్పాటు చేయనున్న జీవ ధ్వజ స్తంభాన్ని పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. మేళ తాళాలు, కోలాట నృత్యాలతో ఈ కార్యక్రమం పండగలా కొనసాగింది. అనంతరం విగ్రహాలకు క్షీరాధివాసం నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు కొనసాగిన ఈ కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

జగ్గయ్యపేట అర్బన్: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పట్టణ ఎస్సై బీవీ.రామారావు అన్నారు. స్థానిక జేఆర్సీ-విశ్వభారతి డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగం-దుష్ఫలితాలు అనే అంశంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా మత్తు పదార్థాల వినియోగాన్ని నిషేధించేందుకు ఒక ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను ప్రవేశపెట్టి వచ్చే అతి కొద్ది నెలల్లో మత్తుపదార్థాల వినియోగ రహిత రాష్ట్రంగా ఉండేందుకు కృషి చేస్తోందన్నారు. చివరిగా విద్యార్థుల చేత మాదకద్రవ్య రహిత ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ కేఎస్.రమేష్, జె.తిరుపతిరావు పాల్గొన్నారు.


భద్రతా చర్యలు తీసుకోవాలి



దుకాణాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

పెనుగంచిప్రోలు: గ్రామంలో వెంచేసి ఉన్న తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన దుకాణదారులు అన్ని భద్రతా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ లక్ష్మీ కల్యాణి పేర్కొన్నారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పలు బొమ్మల దుకాణాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల ఆలయం వద్ద అగ్ని ప్రమాదం చోటుచేసుకుని పలు దుకాణాలు అగ్నికి ఆహుతీ అయ్యాయని తెలిపారు. ఈ నెల 5నుంచి ప్రారంభమయ్యే అమ్మవారి పెద్ద తిరునాళ్లకు షాపుల యజమానులు పెద్ద ఎత్తున బొమ్మలు, గాజులు, అమ్మవారి చిత్ర పటాలు, ఇతర సామగ్రిని కొనుగోలు చేస్తుంటారన్నారు. దుకాణాల్లో వంట గ్యాస్ సలిండర్లు ఉండకూడదన్నారు. ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు ఉంటే వెంటనే ఆ శాఖాధికారులతో మాట్లాడి సరిచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ జేఈఓ ఉమాపతి, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి, వీఆర్వోలు పాల్గొన్నారు.

బ్యాంక్ అధికారులు సహకరించాలి



బ్యాంక్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్

నందిగామ: ప్రభుత్వ పథకాలకు సంబంధించిన లబ్ధిదారులకు బ్యాంక్ అధికారులు సహకరించాలని కమిషనర్ డాక్టర్ జయరాం పేర్కొన్నారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో పలు పథకాలకు సంబంధించి బ్యాంక్ అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. జగనన్న కాలనీలు, జగనన్న తోడు పథకాలలో లబ్ధిదారులకు అవసరమైన రుణాలను వెంటనే మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా స్వయం సహాయక సంఘాల వారికి వ్యక్తిగత రుణాలు కూడా త్వరితగతిన మంజూరు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలు బ్యాంకుల మేనేజర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.